# తీరిన సమస్య

బి. విద్యాసాగర్



**పెళ్ళిచూపులు** జరుగుతున్నాయి. లక్ష్మీపతి గారు పిల్ల వంక చూశారు. బాగానే ఉందని పించింది ఆయనకు. పెళ్ళికొడుకు రాజారావు కూడా చూశాడు.

"అమ్మాయి ఎందాక చదివిం దన్నారు?

"బి. కాం. సెకండ్ క్లాసులో పాసయ్యింది" అని చెప్పారు పరంధామయ్యగారు.

"అమ్మా! సంగీతం ఏమయినా నేర్చుకున్నావా?"

"లేదండీ!"

"నీ పేరేమిటీ?"

"సరోజ అండీ!"

తర్వాత లక్ష్మీపతిగారు పరంధామయ్యగారిని కొన్ని ప్రశ్నలు వేశాడు. సరోజ జాతకం అడిగి తీసుకున్నాడు. తర్వాత-"మేము ఇంటికి వెళ్ళాక మా వాళ్ళతో సంప్రదించి, మా అభిప్రాయం తెలియజేస్తాము" అని చెప్పి వాళ్ళు అక్కడ నుంచి బయలుదేరారు.

వాళ్ళు వెళ్ళిన వారం రోజుల లోపుగా లక్ష్మీపతి గారి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. "మీ పిల్ల మాకు నచ్చింది...జాతకాలు సరిపోయినాయి...మీరు మిగతా విషయాలు మాట్లాడుకోవడానికి వీలు చూసుకుని రండి" అని వ్రాసి ఉంది. అది చదువుకుని పరంధామయ్యగారు సంతోషించాడు. ఇన్నాళ్ళకు తనకు తెలిసిన వాళ్ళతో ఒక మంచి సంబంధం కుదరడం అదృష్టంగా భావించాడు.

ఒక మంచిరోజు చూసుకుని, పరంధామయ్యగారు సంబంధం ఖాయం చేసుకోవడానికి వెళ్ళారు. లక్ష్మీపతిగారిని కలుసుకుని కట్నం విషయం ప్రస్తావించారు.

"మాకు ముప్పై వేలుదాకా ఇస్తామని సంబంధాలు వస్తున్నాయి...మీరు తెలిసిన వాళ్ళు కనుక ఇరవై ఐదు వేలతో చేసుకుందా మనుకుంటున్నాము" అన్నాడు లక్ష్మీపతిగారు.

ఆ మాట విని పరంధామయ్యగారు బాధపడ్డాడు. కట్నం ఎక్కువనిపించినా, తెలిసిన సంబంధం కనుక వదిలిపెట్టడం ఇష్టంలేక సరేనన్నారు. ఆయన ఇంటికి వెళ్ళాక భార్యను సంప్రదిస్తే, మిగతా పొలం అమ్మి, పెళ్ళిచేసేద్దామని సలహా ఇచ్చింది. ఆయన అలాగే చేశాడు. వచ్చిన ముప్పై వేలలో పదిహేనువేలు కట్నం క్రింద అడ్వాన్సుగా ఇచ్చి, మిగతా డబ్బు ముహూర్తం సమయానికి ఇస్తానని చెప్పి సంబంధం ఖాయంచేసుకుని తాంబూలాలు పుచ్చుకున్నారు. ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు.

పెళ్ళి ఇక వారం రోజులలో ఉంది. మిగతా పదివేలు ఇవ్వటానికి మళ్ళీ అప్పుచేయాలి! అందుకోసం చాలాచోట్ల ప్రయత్నించాడు. ఎక్కడా అప్పు పుట్టలేదు. ఇల్లు అమ్మడం ఆయనకు ఇష్టంలేదు. ఈ సమస్యని ఎలా పరిష్కరించడమా అని ఆలోచించాడు. తెలిసిన వాళ్ళు కనుక, మిగతా డబ్బు పెళ్ళి అయినాక వీలుచూసుకుని ఇస్తానని నచ్చచెప్పితే ఒప్పుకుంటారేమో అని భావించాడు.

ఆ రోజు పెళ్ళివారు వచ్చారు. పరంధామయ్యగారు పెళ్ళివారికి ఏర్పాటు చేసిన విడిదికి వెళ్ళి, వియ్యంకుడి చేతులు పట్టుకుని ప్రాధేయపడ్డాడు.

"బావగారూ! క్షమించండి...కట్నం క్రింద ఇవ్వవలసిన మిగతా పదివేలు ఇద్దామంటే నాకు ఎక్కడా అప్పు పుట్టలేదు. అందువలన మీరు నా

యంచు దయయుంచి కొన్నాళ్ళు ఓపికపట్టండి."

"సరే! మీరు తెలిసిన వారు కనుక అలాగే కానీండి!... వీలు చూసుకొని ఇవ్వండి" అన్నాడు లక్ష్మీపతిగారు.

"థాంక్సు!...సాధ్యమైనంత త్వరలో మీ కట్నం బాకీ తీరుస్తాను" అన్నారు వరంధామయ్యగారు.

పెళ్ళి ఘనంగా, ఏ లోటులేకుండా జరిగింది. మూడు నెలలు గడిచాయి. వరంధామయ్యగారు అన్న మాట ప్రకారం బాకీ తీర్చలేదు. ఆయనకు ఎక్కడా అప్పు పుట్టలేదు. ఆయనకు ఉన్న పొలం లోగడ నలుగురు కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేసినప్పుడు కొన్త కొన్త అమ్ముతూ వచ్చాడు. మిగతా పొలంకూడా చివరి అమ్మాయి సరోజ పెళ్ళికి అమ్మాడు. ఆ డబ్బులోనే పదిహేను వేలు కట్నం క్రింద ఇచ్చి, పదిహేనువేలు పెళ్ళికోసం ఖర్చుపెట్టాడు.

ఒకరోజు లక్ష్మీపతిగారి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. కోడల్ని కాపురానికి పంపడానికి ముహూర్తం నిశ్చయించి వ్రాయమని అందులో ఉంది. వరంధామయ్యగారు దిగులుపడ్డాడు...కట్నం బాకీ తీర్చకుండా పిల్లను కాపురానికి పంపడం ఎలా? శాస్త్రిగారిని సంప్రదించి, శోభనం జరిపించడానికి ముహూర్తం నిశ్చయించి, వియ్యంకుడికి తెలియజేశాడు.

అరోజు అల్లుడు రాజారావు వచ్చాడు. వరంధామయ్యగారు మళ్ళీ ఊళ్ళో అప్పుకోసం ప్రయత్నించాడు. కానీ లాభంలేక పోయింది. ఇక అమ్మడానికి ఇల్లు ఒకటి మిగిలింది. అది అమ్మడం ఆయనకు ఇష్టం లేదు. ఈ పరిస్థితిలో ఏమీ చేయడానికి ఆయనకు తోచడంలేదు.

ఆయన అల్లుడిని గదిలోకి తీసుకుని వెళ్ళి, "నాయనా! కట్నం బాకీ డబ్బు ఇద్దామంటే ఎక్కడా అప్పు పుట్టలేదు. అందువలన రెండుమూడు నెలల్లో ఎలాగయినా అప్పుచేసి పంపిస్తానని నాన్నగారితో చెప్పు!... నా మాట విని కొన్త ఓపికపట్టండి!" అని చెప్పాడు.

"అదేమిటండీ! మిగతా డబ్బు మీ అమ్మాయిని కాపురానికి పంపించేటప్పుడు పంపమని మా నాన్నగారు మీకు ఈ మధ్య ఉత్తరం వ్రాశారుట కదా!"

"వ్రాశారు! కానీ ఏమిచేయను! సమయానికి డబ్బు సమకూరలేదు. త్వరలో పంపిస్తామని మీ నాన్నగారితో చెప్పు" అన్నాడు వరంధామయ్యగారు ప్రాధేయపడుతూ.


"సరే, మీ ఇష్టం! మిగతా డబ్బు త్వరలో పంపండి" అన్నాడు అతను.

"అలాగే! తప్పకుండా పంపుతాను."

సరోజను కాపురానికి తీసుకు వెళ్ళారు. మూడు నెలలు గడిచాయి. అయినా వరంధామయ్యగారు బాకీ తీర్చలేదు. పెళ్ళి అయి, పిల్ల కాపురానికికూడా వెళ్ళింది కనుక, వరంధామయ్యగారు కట్నం బాకీ ఇక తీర్చడు అనే నిర్ణయానికి వచ్చారు లక్ష్మీపతిగారు.

"ఏమే! మీ నాన్న ఆ నాడు కట్నం బాకీ పదివేలు త్వరలో తీరుస్తా నన్నాడు...ఆరు నెలలు దాటింది. ఇంతవరకూ ఏమీ ఇవ్వలేదు. ఆయనకు ఇచ్చే ఉద్దేశం ఉన్నట్లు లేదు. ముదనష్టపు సంబంధం చేసుకున్నాము" అంది లక్ష్మీపతిగారి భార్య ఒక రోజు.

"ఆ రోజు పిల్ల నచ్చింది. కావాలని చేసుకున్నారు. నేను గ్రాడ్యుయేటునని మీ రంతా సంతో




షించారు. పిల్ల అందంగా ఉందని మీ వాళ్ళంతా మెచ్చుకున్నారు. ఇప్పుడు మాది ముదనష్టపు సంబంధంగా మీకు కనిపిస్తున్నదా? మా నాన్నగారు కట్నం బాకీ తీర్చలేక పోయేటప్పటికి మీలో ఎంత మార్పు వచ్చింది! మీకు కట్నం ముఖ్యమా పిల్ల అందచందాలు ముఖ్యమా?" అంది సరోజ కోపంగా.

"రెండూ ముఖ్యమే! మా వాడికి ముప్పై వేలు కట్నం ఇస్తామని సంబంధాలు వచ్చినా వదులుకుని, తెలిసిన వాళ్ళు కదా అని మీ సంబంధం చేసుకున్నాము. మీ వాళ్ళు ఇలా మోసం చేస్తారనుకోలేదు."

"మావాళ్ళు మోసం ఏమీ చేయలేదు. మామగారు ఆ రోజు ఇష్టపడి ఈ సంబంధానికి ఒప్పుకున్నారు. కట్నంలో పదివేలు తర్వాత ఇస్తామంటే సరే నన్నారు."

"అదేనమ్మా నేను చేసిన బుద్ధితక్కువ పని!...కట్నం అంతా ఇస్తేకాని, పెళ్ళి జరగడానికి వీలులేదు అని చెప్పితే పోయేది" అన్నాడు లక్ష్మీపతిగారు.

ఆ రోజునుంచి సరోజను రాచి రంపాన పెడుతున్నారు. పనిమనిషిని మాన్పించి, ఇంటిల్లపాది పని ఆమెచేత చేయిస్తున్నారు. తిన్నగా తిండిపెట్టక మాడుస్తున్నారు. సరోజ ఆ బాధలు భరించలేకపోయింది. తండ్రికి ఉత్తరాలు వ్రాసింది. ప్రయోజనం లేకపోయింది. ఆయన మిగతా కట్నం డబ్బు పంపించలేకపోయాడు.

"నీకు తిండి పెట్టడం కూడా దండుగ! దిక్కుమాలిన దానివి! ఏమయినా ఉద్యోగంచేసి సంపాదిస్తావంటే, నీకు ఆ యోగం కూడా ఉన్నట్లు లేదు" అంది అత్తగారు ఒక రోజు కోపంగా.

"ఉద్యోగాలకు అప్లయి చేశాను...ఇంతవరకు నాకు ఎక్కడా కలిసిరాలేదు... నేనేమి చేస్తాను!" అంది సరోజ ఏడుస్తూ.

"అదే నే, మాబాధ! నిన్ను చేసుకుని, మేము అన్నివిధాల నష్టపోయాము" అంది అత్తగారు.

సరోజ భర్త కూడా ఆమెను సరిగా చూడటంలేదు. సూటి పోటి మాటలు అంటూ సరోజ మనస్సుకు బాధ కలిగిస్తున్నాడు. తల్లి బాధలు పెడుతుంటే, చూస్తూ ఊరుకున్నాడు. జోక్యం కలుగజేసుకోవడం లేదు.

ఒక సంవత్సరం దాటింది. వరంధామయ్యగారు కట్నం బాకీ తీర్చలేదు. పిల్ల కాపురానికి వెళ్ళింది కనుక ఆయనకు ఇచ్చే ఉద్దేశం లేదని లక్ష్మీపతిగారు భావించారు. ఒక రోజు కొడుకుతో అన్నారు.

"నువ్వు సరోజకు విడాకులు ఇచ్చేయి...నీకు వేరే మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాను" అన్నారు.

"తొందరపడకండి! మామగారు డబ్బుకోసం ప్రయత్నిస్తున్నామని ఉత్తరాలు వ్రాస్తున్నాడు కదా?... అదీ గాక సరోజకు ఉద్యోగం వచ్చిందంటే, మనకు సమస్య ఉండదు" అన్నాడు రాజారావు.

"నాకు నమ్మకం లేదు" అన్నాడు ఆయన.

మరొక రెండు నెలలు గడిచాయి. సరోజ అత్తగారింట్లో బాధలు పడలేక పుట్టింటికి వచ్చేసింది. వరంధామయ్యగారు కూతురు చెప్పినదంతా విని చాలా బాధపడ్డాడు. లక్ష్మీపతిగారు, ఆయన భార్య ఇంత కఠినంగా ప్రవర్తిస్తారని ఆయన ఊహించలేదు.

రోజులు గడిచిపోతున్నాయి. సరోజ భర్తకు ఉత్తరం వ్రాసినా సమాధానం రావడం లేదు. తల్లితండ్రుల మాటవిని అతనిలోకూడా మార్పు వచ్చింది.

సరోజ ఒక బాంకులో ఆఫీసర్ ఉద్యోగానికి అప్లయిచేసింది. ఇంటర్వ్యూకి కూడా వెళ్ళి వచ్చింది. ఆ రోజు సెలక్టు అయినట్లు వాళ్ళ దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. సరోజ అది విని అమితానందం పొందింది. తనకు ఉద్యోగం వస్తే అత్త మామలు నెత్తిమీద పెట్టుకుని పూజిస్తారని, భర్తకూడా సరిగా చూస్తాడని భావించింది. వరంధామయ్యగారు కూడా ఎంతో సంతోషించాడు. వియ్యంకుడికి ఈ విషయం తెలియజేస్తూ ఉత్తరం వ్రాశాడు. సరోజ కూడా భర్తకు ఉత్తరం వ్రాసింది. వెంటనే సమాధానం వచ్చింది.

"హార్టీ కంగ్రాచులేషన్సు! నీకు తప్పకుండా ఉద్యోగం వస్తుందని నాకు తెలుసు! నీకు మంచి భవిష్యత్తు ఉందనే ఉద్దేశంతోనే, ఆ రోజు కావాలని నిన్ను పెళ్ళి చేసుకున్నాను" అంటూ వ్రాశాడు.

ఆ ఉత్తరం చదువుకుని సరోజ నవ్వుకుంది. కట్నం బాకీ ఇవ్వలేదని ఇన్నాళ్ళు సూటి పోటి మాటలు అంటూ అత్తగారు తనను నానా బాధలు పెడుతుంటే చూస్తూ ఊరుకున్న తన భర్త, ఈ రోజు తను అఫీసర్‌గా సెలక్టు అయేటప్పటికి ఎంత మారిపోయాడు!

మర్నాడు లక్ష్మీపతిగారి దగ్గర నుంచి కూడా ఉత్తరం వచ్చింది. "మాకోడలు సరోజ బాంకులో ఆఫీసర్‌గా సెలక్టు అయిందని తెలిసి చాలా సంతోషించాము...ఇన్నాళ్ళు మీరు కట్నం క్రింద ఇస్తామన్న డబ్బులో పదివేలు ఇంకా ఇవ్వలేదన్న బాధతో అమ్మాయిని బాధపెట్టాము... మీ మనస్సుకు బాధ కలిగించాము. మమ్ములను క్షమించండి!...మీరు ఇక కట్నం బావతు డబ్బు మాకేమీ ఇవ్వ నక్కరలేదు!...లోగడ జరిగిన విషయాలు మీరు మరిచిపోయి, మంచిరోజు చూసుకుని సరోజను మళ్ళీ కాపురానికి పంపించండి" అని వ్రాశాడు.

వరంధామయ్యగారు ఆశ్చర్యపోయాడు. ఇన్నాళ్ళు కట్నం డబ్బులో పదివేలు ఇవ్వలేదని సరోజను నానా బాధలు పెట్టిన వాళ్ళు, ఈ రోజు సరోజకు ఉద్యోగం రాగానే, వాళ్ళలో ఎంత మార్పు వచ్చింది! ఈ లోకంలో డబ్బు ముఖ్యం! పిల్ల గుణగణాలు, అందచందాలు అంత ముఖ్యంకాదు. ★